నేటి దినపత్రిక
# సూర్య
18వ వసంతంలోకి
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు
బుధవారం | 02 ఏప్రిల్ 2025 | పేజీలు 8

## పన్నుల వసూళ్లలో రెవెన్యూ కృషి అభినందనీయం

### కమిషనర్ సూర్యతేజ



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరపాలక సంస్థ రెవెన్యూ విభాగం ఆధ్వర్యంలో 2024-25 ఆర్థిక సంవత్సరం పన్నుల వసూళ్లలో విశేష కృషి చేసిన అధికారులు, సిబ్బంది సేవలు అభినందనీయమని కమిషనర్ సూర్యతేజ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పన్నుల వసూళ్లను కమిషనర్ వివరిస్తూ.. గత ఏడాది ఏప్రిల్ నెల 1వ తేదీ నుంచి 31-03-25వ తేదీ వరకు ఆస్థి పన్ను మొత్తం రూ. 70,14,02,787/- కోట్లు కాగా, ఖాళీ స్థలం పన్నులు రూ. 7,62,06,972 కోట్లు, తాగునీటి కుళాయి పన్ను రూ.9,85,83,800 కోట్ల రూపాయలను వసూలు చేశామని తెలిపారు. ఆస్థి పన్ను, ఖాళీ స్థలం పన్నులు మొత్తం కలిపి రూ. 77,76,09,759/- కోట్ల రూపాయలను వసూలు చేసారని తెలిపారు. అదేవిధంగా 31-03-25 తేదీ ఒక్కరోజునే రూ.2.85 కోట్ల రూపాయల పన్నులను వసూలు చేసి -మిగతా 2లో

### గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు ఆరికట్టేందుకు

## డెకాయ్ ఆపరేషన్స్



**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** జిల్లాలో గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు అరికట్టేందుకు డెకాయ్ ఆపరేషన్స్ (ఆకస్మిక తనిఖీలు) ఎక్కువగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆనంద్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉదయం నెల్లూరు కలెక్టరు వారి ఛాంబర్‌లో గర్భస్త పిండ లింగ నిర్ధారణ నిషేధ చట్టం, సహాయక పునరుత్పత్తి సాంకేతికత చట్టం (పిసి పిఎన్‌డిటి) అమలుపై జిల్లా స్థాయి అడ్వయిజరీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గర్భస్త శిశువులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై వుందన్నారు. లింగనిర్ధారణ పరీక్షలు అరికట్టేందుకు, నిర్వాహకులపై కఠిన తీసుకునేందుకు జిల్లాలో వైద్యశాలలు, స్కానింగ్ సెంటర్లపై డెకాయ్ ఆపరేషన్స్ మరింత ముమ్మరంగా నిర్వహించాలన్నారు. స్కానింగ్ కేంద్రాల నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలను తప్పక పాటించాలన్నారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేయడమంటే భ్రూణ హత్యలను ప్రోత్సహించడమేనన్నారు. చట్టాన్ని ఉల్లంఘించి లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే వైద్యులు, స్కానింగ్ కేంద్రాల నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కమిటీ సభ్యులు, ఎన్‌జివోలు లింగ నిర్ధారణ పరీక్షలను పూర్తిగా అరికట్టడమే లక్ష్యంగా సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఈ సందర్భంగా సూచించారు.
ఇప్పటివరకు జిల్లాలో 50 డెకాయ్ ఆపరేషన్లు -మిగతా 2లో

## ఇదేందయ్యా దోపిడీ..

# నేనెక్కడా చూడలే!



- రీచ్‌ను తనిఖీ చేసిన మైనింగ్ శాఖ
- వాహనాలు వదిలి పరుగులు పెట్టిన డ్రైవర్లు
- స్టేషన్‌కు తరలించిన ఇసుక టిప్పర్లు

**అనంతసాగరం, మేజర్‌న్యూస్ :** అనంతసాగరం మండలం పడమటి కమ్మంపాడు ఇసుక రీచ్‌ను జిల్లా మైనింగ్ అధికారులు ఆకస్మిక తనిఖీ చేశారు. రాత్రి పగలు అని తేడా లేకుండా ఇష్టారాజ్యంగా భారీ వాహనాల్లో ఇసుకను కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు ఏదేచ్ఛగా తరలిస్తున్నారన్న సమాచారంతో ఉన్నతాధికారుల ఆదేశానుసారం తనిఖీ చేశారు. ప్రభుత్వ వాహనం రీచ్ లోనికి వెళ్ళగా అధికారుల రాకను గమనించిన టిప్పర్ డ్రైవర్లు ఇద్దరూ పరుగులు తీశారు. ఒక టిప్పర్‌ను మాత్రం డ్రైవర్‌తో సహా సోమశిల పోలీస్ స్టేషన్కు తరలించారు. మిగిలిన వాహనాలను సైతం స్టేషన్కు రప్పించేందుకు పోలీసుల సహకారం తీసుకున్నారు. భారీ వాహనాలలో ఇసుకను తరలించేందుకు అక్కడ చేసుకున్న ఏర్పాట్లు చూసి మైనింగ్ ఆర్ఐ స్వాతి అవాక్కయ్యారు. ప్రధాన రహదారికి సమీపంగానే భారీగా ఇసుకను డంపింగ్ చేసి ఓ చిన్నపాటి కొండను తలపించేలా ఉన్న దృశ్యాన్ని తాను ఎప్పుడూ చూడలేదని ఆమె అన్నారు. టిప్పర్లకు ఇసుకను లోడ్ చేసేందుకు రీచ్‌లో ఉన్న భారీ హిటాచిల పరిస్థితి ఏంటని ఆమెను అడగగా కొన్ని సాంకేతిక పరమైన చిక్కులు ఉన్నాయని మహిళగా తానేమి చేయలేని స్థితిలో ఉన్నానని తెలిపారు. ఇంత యదేచ్ఛగా పట్టపగలే టిప్పర్ల వాహన బాడికి మించి లోడు చేసుకుని వెళ్తున్న స్థానిక ఆయా శాఖల అధికారులకు పట్టనట్టు ఉండటం విడ్డూరంగా ఉందని ఆమె ఆశ్చర్య వ్యక్తం చేశారు. తమ ఉన్నతాధికారులు తమపై నమ్మకంతో తనిఖీలు చేసేందుకు అనుమతులు ఇస్తుంటారని అందునుబట్టి తాము విధి నిర్వహణలో ఎక్కడ రాజీ పడమని ఆమె తెలిపారు. ఇలాంటి దోపిడీతో ప్రభుత్వానికి రావలసిన రాయల్టీలకు గండి పడుతుందని, అలాగే వాహనం నుంచి నీరు ధారాళంగా కారుతూ ఉండటం చూస్తుంటే ఏ స్థాయిలో భూగర్భ జలాలు అడుగుంటేలా త్రవ్వకాలు చేపడుతున్నారో అర్థం అవుతుందని ఆమె అన్నారు. రీచ్‌లో జరుగుతున్న ఇసుక దందాను ఉన్నతాధికారులకు వాస్తవ పరిస్థితులను వివరిస్తానని తెలిపారు. తమ జిల్లా కార్యాల యానికి తరచూ కొందరు ఇసుక అక్రమ దోపిడీపై ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చే వారని అయితే వారు చెప్పే తీవ్ర సమాచారం బట్టి వాస్తవికతకు సత్య దూరంగా ఉంటుందని తాము భావించే వారమన్నారు. అయితే ఇక్కడికి వచ్చి చూశాక వారి మాటలు వాస్తవమే అయ్యాయని స్వాతి అన్నారు. కార్యక్రమంలో మైనింగ్ టీఏ వాణిశ్రీ, పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# అగ్గి రేగితే బుగ్గే!



**జి**ల్లాలో పొగాకు రైతుల పరిస్థితి దారుణంగా మారింది. పంట సాగు చేసి వేలానికి తీసుకుపోయే తరుణంలో ఎన్నో అవాంతరాలు ఎదుర్కొని వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. వాతావరణం పరిస్థితులు ప్రభావం, పెరిగిన పెట్టుబడులు, దీనికి తోడు లభించని గిట్టుబాటు ధరల ప్రభావంతో రైతులు ధనమునకుల వుతున్నారు. ఈ పరిస్థితి ఇలా ఉంటే అగ్ని ప్రమాదాలు కూడా పొగాకు రైతును నిలువునా ముంచేస్తోంది. పొగాకును క్యూరింగ్ చేసే సమయంలో ప్రమాదపు శాత్తు అగ్ని ప్రమాదాలు సంభవించి రైతులను లక్షల రూపాయల ఆస్తి నష్టానికి గురిచేస్తుంది. ప్రతి ఏటా ఈ తంతు జరగక తప్పడం లేదు. ప్రత్యామ్నాయ మార్గము కనిపించడం లేదని రైతులు వాపోతున్నారు. వివరాల్లోకి వెళితే..

- ఏటా పొగాకు బ్యారన్ల దగ్ధం
- లక్షల్లో ఆస్తి నష్టం
- లబోదిబోమంటున్న పొగాకు రైతులు

**మర్రిపాడు, మేజర్‌న్యూస్ :** జిల్లాలోని డీసీపల్లి, కలిగిరి పొగాకు వేలం కేంద్రాల పరిధిలో వేలాదిమంది రైతులు వర్జీనియా పొగాకును సాగు చేస్తూ కుటుంబాలను పోషించుకుంటున్నారు. అటు ఉదయగిరి ఇటు ఆత్మకూరు నియోజకవర్గాల పరిధిలో ఉండే మండలాలకు సంబంధించిన రైతులు ఆ పొగాకు సాగు మీదనే ఆధారపడి బతకాల్సిన పరిస్థితి. ఈ నేపథ్యంలో ఏడాది కేడాది పెట్టుబడులు రెట్టింపు అవుతున్నాయి. కూలీల ఖర్చు దగ్గరి నుంచి పొగాకును వేలం కేంద్రానికి తీసుకెళ్లే వరకు లక్షల రూపాయలు పెట్టుబడులు పెట్టి రైతులు సాగును చేపడుతున్న గిట్టుబాటు ధరలు లభించక పొగాకును వెనక్కి తీసుకురావాల్సిన పరిస్థితి. ఈ నేపథ్యంలో అగ్ని ప్రమాదాలు కూడా పొగాకు రైతును నిలువునా వెంటాడుతున్నాయి. పొగాకును క్యూరింగ్ చేసే సమయంలో ఈ అగ్ని ప్రమాదాలు సంభవించి రైతులు -మిగతా 2లో

### బలవంతపు వాంగ్మూలంతో

## కాకాణిపై అక్రమ కేసు

- కూటమి ప్రభుత్వం కుట్ర రాజకీయాలకు పరాకాష్ట
- మాజీ మంత్రి టార్గెట్‌గా డైవర్షన్ పాలిటిక్స్
- ఎమ్మెల్సీ పర్వత రెడ్డి ధ్వజం




**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** టీడీపీ కూటమి ప్రభుత్వ కుట్ర రాజకీయాలకు పరాకాష్టగా తప్పుడు వాంగ్మూలంతో మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై అక్రమంగా కేసు నమోదు చేశారని ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ధ్వజమెత్తారు. మంగళవారం జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఉగాది పండగ కోసం తన కుటుంబంతో కలిసి కాకాణి గోవర్ధన్‌రెడ్డి హైదరాబాద్ వెళ్లినప్పుడు, కావాలనే ఆయన ఇంటికి నోటీసు అంటించి వెంటనే విచారణకు రమ్మనడం అత్యంత హేయమైన చర్య అన్నారు. నెల్లూరులో ఎప్పుడూ చూడని -మిగతా 2లో

# అస్థవ్యస్థంగా ఆత్మకూరు మున్సిపల్ పాలన

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరులో మున్సిపల్ పాలన అస్థవ్యస్థంగా ఉందని సర్వత్రా వ్యాఖ్యానిస్తున్నారు. ప్రజలచేత ఎన్నుకోబడిన కౌన్సిలర్లు పరిపాలన గురించి కానీ, సమస్యల గురించి కానీ పట్టించు కుంటున్న దాఖలాలు కానరావడం లేదు. పట్టణంలో కొన్ని ప్రాంతాలకు చెత్తసేకరణ వాహనాలు వెళ్ళడం లేదని పలువురు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలో దోమలు, వానరాలు, గోమాతల బెడద తీవ్రంగా ఉంది. దోమల నివారణకు బ్లీచింగ్ చల్లడం కానీ, మలాథియాన్ పిచికారీ చేయించడం కానీ, ఫాగింగ్ చేయించడం కానీ ఏళ్ళ తరబడి జరగడం లేదు. ఈవిషయమై మున్సిపల్ కౌన్సిల్ సమావేశాల్లో ప్రజాప్రతినిధులు నోరువిప్పిన దాఖలాలు లేనేలేవు. అసలు క్రమం తప్పకుండా మున్సిపల్ సమావేశాలు కూడా జరగడం లేదని పలువురు కౌన్సిలర్లే వ్యాఖ్యానిస్తున్నారు. ఇటీవల బడ్జెట్‌సమావేశం మాత్రం నిర్వహించారు. మున్సిపాలిటీ స్థాయి పెరిగినా తదనుగుణంగా కార్మికులు, సిబ్బంది పెరగడం కానీ, సౌకర్యాలు మెరుగుకావడం కానీ లేదు. అనేక విస్తరణ ప్రాంతాల్లో రోడ్లు నిర్మించలేదు. డ్రైనేజి వ్యవస్థ అస్థవ్యస్థంగా ఉంది. సైడు కాలువల్లో మురుగునీరు సాఫీగా దిగువకు వెళ్లే పరిస్థితి లేదు. కాలువను శుభ్రం చేయడం కూడా తరచూ జరగడం లేదని పలువురు అభిప్రాయపడుతున్నారు. మున్సిపల్ పరిధిలోని నెల్లూరుపాళెం, శాంతినగరం, వీవర్స్‌కాలనీ తదితర ప్రాంతాల్లో ఆక్రమణలు విరివిగా ఉండగా ఏళ్ళ తరబడి తరచూ విచారణలు అంటుంటారే తప్ప ఏమాత్రం చర్యలు తీసుకుంటున్న దాఖలాలు లేవు. ప్రస్థుతం ఆత్మకూరు నియోజకవర్గానికి రాష్ట్ర దేవాదాయశాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి శాసనసభ్యులుగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఆయన అబివృద్ధికి నిలువెత్తు చిహ్నంగా గతంలో చేసిచూపారు. ఈదపా కూడా ఆత్మకూరు మున్సిపాలిటీని సుందరంగా తీర్చిదిద్దాలని, అన్ని సౌకర్యాలు కల్పించాలని ధృఢ సంకల్పంతో ఉన్నారు. ఆయన లక్ష్యాలకనుగుణంగా ఇక్కడి పాలకులు స్పదించడం లేదని పలువురు వ్యాఖ్యానిస్తు న్నారు. టిడ్కో గృహాల్లో పలు సౌకర్యాలు కల్పించాల్సి ఉన్నా ఏళ్ళ తరబడి నిర్లక్ష్యం చేస్తున్నారు. ఐదారు వందలమంది అక్కడ నివాసాలుంటుండగా వారికోసం ప్రత్యేకంగా రేషన్‌సరుకుల పంపిణీకి ఒక దుకాణం ఏర్పాటు చేయాలని వారు అనాదిగా కోరుతున్నా పట్టించు కునే నాధుడే లేరు. అక్కడే ఒక అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు చేయాలని కోరుతున్నా అతీ గతీ లేదు. మంత్రి రామనారాయణరెడ్డి ప్రత్యేక శ్రద్ధతో టిడ్కోగృహసముదాయంలో ఒక రామాలయ నిర్మాణానికి ఫిబ్రవరి 9వతేదీ ఐదుమంది మంత్రుల బృందం శంఖుస్థాపనగావించారు. మున్సిపల్ బస్టాండు వద్ద ప్రయాణీకులకు కనీససౌకర్యాలు కల్పించకపోగా తాగునీటిని శ్రీసాంబశివచారిటబుల్‌ట్రస్ట్ చైర్మెన్ కంచి పరమేశ్వరరెడ్డి ఏర్పాటు చేశారు. అక్కడ ప్రయాణీకులకు సరిపడా బెంచీలు కూడా ఏర్పాటు చేయలేదు. ఈ అంశాలన్నింటిపై మంత్రి ఆనంరామనారాయణరెడ్డి దృష్టి సారిస్తేనే ఫలితం ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. మున్సిపాలకుల్లో స్పందన లభిస్తుందేమో చూడాల్సి ఉంది.

# అగ్గి రేగితే బు(బొ)గ్గే !



*(మొదటి పేజీ తరువాయి)*

లక్షలాది రూపాయలు నష్టపోతున్నారు. పొగాకు బేరన్లో ఉష్ణోగ్రతలు అధికంగా ఉన్నప్పుడు అల్లుడు కర్రపై ఉన్నటువంటి పొగాకు గొట్టాల మీద పడటంతో ఈ ప్రమాదాలు ఎక్కువగా సంభవిస్తున్నాయని రైతులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. బ్యారన్ దగ్గర ఉండేటటువంటి మేస్త్రి కాస్త నిర్లక్ష్యం వ్యవహరిస్తే ఈ ప్రమాదాలు ఎక్కువగా సంభవించే అవకాశాలు ఉన్నాయని రైతులు చెబుతున్నారు. ఈ ప్రమాదాలతో బ్యారన్ లో ఉన్నటువంటి గొట్టాలతో పాటు అల్లుడు కర్ర పొగాకు అగ్నికి ఆహుతై రైతులకు తీవ్ర నష్టాన్ని మిగులుస్తోంది. సమీపంలోని అగ్నిమాపక కేంద్రాలకు కూడా సమాచారం ఇచ్చినప్పటికీ ఆ వాహనాలు వచ్చేటప్పటికి పొగాకు కాస్త బూడిద మారి దర్శనమిస్తోంది. దీంతో రైతులు తీవ్ర నష్టానికి గురికాక తప్పడం లేదు. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేసినప్పటికీ కాస్తోపోస్తూ మిగిలి ఉన్న పొగాకు వేడిమి దాటికి ఎందుకు పనికి రాకుండా పోయి రైతును నిలువునా ముంచేస్తుంది. ఆరుగాలం అష్ట కష్టాలు పడి పండించిన పొగాకు కలలేదుటే అగ్నికి ఆహుతి అవుతుంటే ఆ రైతుల ఆవేదనకు అంతులేకుండా పోతుంది. అసలే వేసవికాలం ఆపై తీవ్ర ఉష్ణోగ్రతతో పొగాకును క్యూరింగ్ చేసే సమయం. ఇంకేముంది రెప్పపాటు ప్రమాదం జరిగిన పొగాకు బూడిద గా మారి రైతును తీవ్ర నష్టానికి గురి చేస్తోంది. ప్రతి ఏటా ఇలా రైతులు లక్షలాది రూపాయలు నష్టపోతున్నారు. అందువలన బోర్డు అధికారులు అగ్ని ప్రమాదాలకు గురైన బ్యారన్లకు తగు నష్టపరిహారం అందేలా చూడాలని జిల్లాలోని పొగాకు రైతాంగం కోరుకుంటుంది.

# బలవంతపు వాంగ్మూలంతో కాకాణిపై అక్రమ కేసు

*(మొదటి పేజీ తరువాయి)*

వికృత రాజకీయం చేస్తున్నారని పేర్కొన్నారు. నెల్లూరు జిల్లా రాజకీయాల్లో ఎప్పుడూ చూడని విధంగా సీనియర్ నాయకుల మీద అక్రమ కేసులు నమోదు చేసి అరెస్ట్ చేయాలని ప్రయత్నిస్తున్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వంలో జరుగుతున్న ఈ వికృత రాజకీయాలు చూసి అన్ని వర్గాల వారు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయలేక, ప్రశ్నిస్తున్న గొంతులను నొక్కాలని కూటమి ప్రభుత్వం ఈ వికృత రాజకీ యాలకు పాల్పడుతోంది. డైవర్షన్ పాలిటిక్స్‌తో ప్రజల దృష్టి మళ్లించాలని ప్రయత్నం చేస్తోంది. కూటమి ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ, వారి ప్రజా వ్యతిరేక పాలనను ఎప్పటికప్పుడు ఎండగడుతుంటే ఓర్చుకోలేక మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని టార్గెట్‌గా చేసుకుని ప్రభుత్వం కుట్రలు చేస్తోంది. కాకాణి గోవర్దన్‌రెడ్డి కుటుంబం దశాబ్దాలుగా నెల్లూరు రాజకీ యాల్లో ఉంటోంది. అలాంటి వ్యక్తిని కూటమి ప్రభుత్వం టార్గెట్ చేసి అక్రమ కేసులు బనాయించి ఇబ్బంది పెట్టాలని చూస్తోందని అన్నారు. పొదలకూరు మండలంలో క్వార్ట్ మైనింగ్‌లో మాజీ మంత్రి కాకాణిని ఎలాగైనా ఇరికించి జైల్లో నిర్బంధించాలనే కుట్రతో మూడు నెలలుగా ప్రభుత్వం నానా అవస్థలు పడుతోంది. వారం క్రితం ఒక వ్యక్తిని అరెస్ట్ చేసిన పోలీసులు, అతన్ని బెదిరించి తప్పుడు వాంగ్మూలం తీసుకున్నారు. దాని ఆధారంగా కాకాణిపై కేసు నమోదు చేసినట్లు తెలుస్తోంది. పైగా ఆయనకు బెయిల్ రాకుండా ఉండేందుకు నాన్ బెయిలబుల్ సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. దీనిపై కాకాణి గోవర్థన్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించడంతో, ఆయన వేసిన క్వాష్ పిటిషన్ మీద విచారణ ఉన్న నేపథ్యంలో ఎక్కడ క్వాష్ అవుతుందోననే భయంతో ఆయనపై ఈరోజు ఎస్సీ, ఎస్టీ కేసు పెట్టారు. ఇంకోపక్క గోవర్ధన్‌రెడ్డి రోజూ పార్టీ ఆఫీసుకే వసున్నా, పరారైపోయారని మీడియాలో ప్రచారం చేయిస్తున్నారు. ఏరోజుకారోజు ఈరోజే అరెస్ట్ చేస్తారని కూటమి నాయకులు తప్పుడు ప్రచారం చేయిస్తున్నారు. ఉగాది పండుగను కుటుంబంతో కలిసి జరుపుకునేందుకు కాకాణి గోవర్ధన్‌రెడ్డి హైదరాబాద్ వెళ్లిన విషయాన్ని తెలుసుకున్న పోలీసులు, కావాలనే పండగ రోజు, ఆదివారం సాయంత్రం 6.30 గంటల సమయంలో నెల్లూరులో ఆయన ఇంటికి వెళ్లారు. నోటీస్ ఇచ్చే నెపంతో తాళాలు పగలగొట్టి, ఇంటి గోడలు దూకే ప్రయత్నం చేశారు. చివరికి ఇంటి గోడలకు నోటీస్ అంటించి, సోమవారం ఉదయం విచారణకు హాజరు కావాలని అందులో నిర్దేశించారు. నిజానికి శనివారం వరకు ఆయన ఇక్కడే ఉన్నా నోటీసులు ఇచ్చేందుకు పోలీసులకు తీరిక లేదు. కావాలని పండగ రోజు ఆయన్ను ఇబ్బంది పెట్టాలనే కుట్రతోనే హడావుడి చేసి వెళ్లారు. కాకాణి పారిపోయాడని ప్రచారం చేసుకుంటున్న కూటమి నాయకుల నోళ్లు మూయించడానికి ఆయన హైదరాబాద్‌లో కుటుంబంతో కలిసి పండగ చేసుకుంటున్న ఫొటోలను 7.30 గంటలకు అన్ని మాధ్యమాలకు విడుదల చేశారు. దీంతో హైదరాబాద్ వెళ్లిన పోలీసులతో బుధవారం తనకి వేర్వేరు పనులున్నాయని, గురువారం వస్తానని చెప్పినా వినుకోకుండా 24 గంటల్లో విచారణకు హాజరు కావాలని నోటీసులు ఇచ్చి వచ్చారు. గురువారం నెల్లూరులోనే ఉంటారు. నోటీసులు గురించి కాకాణితో మాట్లాడినప్పుడు బుధవారం సాయంత్రానికి గురువారం ఉదయం కల్లా నెల్లూరులో అందుబాటులో ఉంటానని స్పష్టంగా చెప్పారు. కావాలంటే పోలీసులు గురువారం నెల్లూరు రావొచ్చని చెప్పారు. ఇలా అక్రమ కేసులు బనాయించి వైయస్సార్‌సీపీ నాయకులను, కార్యకర్తలను అడ్డుకోవాలని చూడటం అవివేకమే అవుతుంది. కాగా, తాము ఇలాంటి అక్రమ కేసులకు భయపడే ప్రసక్తి లేదని స్పష్టం చేశారు.

## ఉత్తర కాలవలో యువకుడి మృతదేహం లభ్యం



**అనంతసాగరం, మేజర్‌న్యూస్ :** అనంతసాగర మండలం మినగల్లు గ్రామానికి చెందిన షేక్ మస్తాన్ బాష (22) మృతదేహం మంగళవారం సోమశిల ఉత్తర కాలవలో లభ్యమయింది. వివరాల్లోకెళితే మినగల్లు గ్రామానికి చెందిన మస్తాన్ భాష సోమవారం రంజాన్ పండుగ సందర్భంగా స్నేహితులతో కలిసి గ్రామ సమీపానగల ఉత్తర కాలవలకు ఈతకై వెళ్ళాడు. కాలువలో ప్రవాహం ఉధృతంగా ఉండడంతో నీట మునిగి కొట్టుకుపోయాడు. మంగళవారం నల్లరాజుపాలెం గ్రామ సమీపానగల కాలువలో మృతదేహం బయటపడింది. విషయం తెలుసుకున్న అనంతసాగరం ఎస్ఐ సూర్య ప్రకాశ్ రెడ్డి సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి వెళ్లి స్థానికుల సహకారంతో మృతదేహాన్ని బయటకు తీశారు. కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఆత్మకూరుకు తరలించారు. యువకుడి ఈత సరదా కుటుంబంతోపాటు గ్రామంలో విషాదఛాయలు అలుముకునేలా చేశాయి.

## బొబ్బేపల్లి పుట్టినరోజు సందర్భంగా అన్నదానం



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** సర్వేపల్లి నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్ బాబు పుట్టినరోజు సందర్భంగా సేవా కార్యక్రమాలు మంగళవారం మండలంలో జరిగాయి. పైన పురం గ్రామపంచాయతీ దేవర దిబ్బ గిరిజన కాలనీలో అన్నదానం కార్యక్రమా న్ని జనసైనికులు ఘనంగా చేశారు. సమన్వయకర్త సురేష్ బాబు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. గిరిజన కుటుంబాల మధ్య పుట్టినరోజు వేడుకలు జరుపుకోవాలని కేక్ కట్ చేయడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పేదలకు సేవా కార్యక్రమాలు చేయడం తమ ఉద్దేశం అన్నారు. గిరిజన కుటుంబాలకు అండగా ఉంటా మని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జనసైనికులతోపాటు వీరమగళ భవాని నాయుడు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు
## ఆరికట్టేందుకు డెకాయ్ ఆపరేషన్స్

*(మొదటి పేజీ తరువాయి)*

చేపట్టామని, స్కానింగ్ కేంద్రాలు, వైద్యశాలల్లో ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తున్నట్లు డిఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ సుజాత కలెక్టర్‌కు వివరించారు. ఈ సమావేశంలో జిల్లా ఇన్యూన్మైజేషన్ అధికారి ఉమామహేశ్వరి, మహిళా పోలీసుస్టేషన్ డిఎస్‌పి రామారావు, డెమో కనకరత్నం, ఎన్‌జివో కవితారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పన్నుల వసూళ్లలో..
## రెవెన్యూ విభాగం కృషి అభినందనీయం

*(మొదటి పేజీ తరువాయి)*

రెవెన్యూ విభాగం సత్తా చాటుకున్నారని కమిషనర్ ప్రశంసిం చారు. గత ఏడాది ఆస్థి పన్ను, రూ. 58.58 కోట్లు, ఖాళీ స్థలం పన్ను రూ.7.80కోట్లతో మొత్తం రూ.66.38 కోట్లు కాగా ఈ ఏడాది వసూళ్లలో రూ.11.38 కోట్లను అదనంగా వసూలు చేయడంలో డెప్యూటీ కమి షనర్ చెన్నుడు, రెవెన్యూ విభాగం అధికారి ఇనాయతుల్లా, నూతనంగా బాధ్యతలు స్వీకరించిన రెవెన్యూ ఇన్స్‌పెక్టర్‌లు, వారితోపాటు ఇంజనీరింగ్ అధికారులు, వార్డు సచివాలయ అడ్మిన్, అమెనిటీస్ కార్యదర్శులు చురుకుగా విధులను నిర్వర్తించారని కమిషనర్ అభినందనలు తెలిపారు.

# ప్రశాంతంగా ముగిసిన పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** మార్చి 17వ తేదీన ప్రారంభమైన పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు ఏప్రిల్ 1వ తేదీతో ప్రశాంతంగా ముగిశాయి. సంవత్సర కాలం పాటు విద్యార్థులు కష్టపడి చదివిన చదువును మూడు గంటల కాలంలో పరీక్షించుకున్నారు. రాత్రిగా పగలనకా కష్టపడి చదివారు. చివరి పరీక్ష అయిపోగానే ఎంతో ఉల్లాసంగా ఉత్సాహంగా బయటకు పరుగులు తీశారు. పరీక్షలు చక్కగా రాశామంటూ ఉత్సాహాన్ని వ్యక్తపరిచారు. బయటకు రాగానే శీతల పానీయాలు ఐస్ క్రీమ్స్ కొనడానికి ఆనందోత్సవంతో వెళ్లారు. ఒకరికి ఒకరు స్నేహబంధాన్ని గుర్తు చేసుకుంటూ కరచాలనం చేసుకుని బయల్దేరారు. పాఠశాల ఉపాధ్యాయులు తమ పాఠశాల విద్యార్థులు పరీక్షలు బాగా రాశారన్న సంతోషంతో పిల్లలను అభినందించారు. సంవత్సర కాలంగా ఎంతో కష్టపడి చదివి ఈ పరీక్షలు రాశామన్న సంతృప్తితో విద్యార్థులు మంచి ఫలితాల కోసం ఎదురుచూస్తున్నారు. పరీక్షలో ఎంతో ప్రశాంతంగా జరిగినట్లు ఎంఈఓ మధుసూధన్ రెడ్డి తెలిపారు. ఈ పరీక్షలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎస్ఐ వీర ప్రతాప్ తన సిబ్బందిని ఆయా పరీక్ష కేంద్రాలలో నియమించారు. విద్యార్థులు పరీక్ష అనంతరం తమ తమ స్వగృహాలకు బయలుదేరి వెళ్లారు.

# బాలాజీ నగర్‌లో నూతన టెంపో స్టాండ్ ప్రారంభం



**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరం, బాలాజీ నగర్ లో బిజెపి మండల అధ్యక్షులు మింగా కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో బిజెపి సెంటర్ నందు (బీజేఎంఎం) నూతన టెంపో కారు టాక్సీ స్టాండ్ ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన భారతీయ జనతా పార్టీ నెల్లూరు జిల్లా అధ్యక్షులు శిపారెడ్డి వంశీధర్ రెడ్డి స్టాండ్‌ను ప్రారంభించ అనంతరం మీడియాతో, మాట్లాడుతూ.. టెంపో స్టాండ్ వల్ల ప్రజలకు రవాణా సౌలభ్యం అందుబాటులోకి రావడంతో పాటు, డ్రైవర్లు, మెకానిక్‌లు, ఇతర కార్మికులకు ఉపాధి అవకాశాలు కలుగుతాయనీ, బాహ్య ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికులకు సులభంగా వాహనాలు లభిస్తాయన్నారు. ప్రజలు రవాణా కోసం వేచిచూడాల్సిన అవసరం లేకుండా, సమయాన్ని ఆదా చేసుకోవచ్చు. అదనంగా, అధికారికంగా గుర్తింపు పొందిన స్టాండ్ కావడంతో ప్రయాణ భద్రత కూడా మెరుగవుతుందనీ అన్నారు. ఈ కార్యక్రమంలో స్టాండ్ అధ్యక్షులు రంగా రావు, ముక్కు రాధాకృష్ణ గౌడ్, మనోహర్, గురు ట్రావెల్స్ హరి కుమార్, మల్లిఖార్జున, మండల నాయకులు, స్టాండ్ నాయకులు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# ల్యాంప్ లైట్నింగ్ కార్యక్రమం




**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి జవహర్ భారతి నర్సింగ్ కళాశాలలో ల్యాంప్ లైట్నింగ్ సెర్మని అనే కార్యక్రమాన్ని శంకరం హాల్లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నర్సింగ్ కళాశాల కరస్పాండెంట్ దొడ్ల విశాల్ అధ్యక్షతన జరిగినది. అనంతరం దొడ్ల విశాల్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ.. వైద్య వృత్తిలో అంకితభవం, సహనం, ఓర్పు చాలా అవసరమని ప్రతి ధనుస్సు ప్రతి వైద్య సహాయకులు చాలా శాంతి స్వభావంతో రోగులకు సేవలు అందించినప్పుడే వారి యొక్క వృత్తికి సార్ధకతని తెలిపారు. అలాగే ఎంవి భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి మదర్ తెరిసా అని ఫ్లోరెన్స్ నైటింగేల్ ని ఆదర్శంగా తీసుకొని వైద్య వృత్తిలో ముందుకు వెళ్లాలని కోరారు. అలాగే కళాశాల ప్రిన్సిపాల్ జి.బ్యులా ఎస్తేర్ మాట్లాడుతూ.. విద్యార్థులు చదువు పట్ల ఇష్టముతో కష్టపడి చదువుకుంటే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహించి తను చదువుకున్న పాఠశాలకు మంచి పేరు ప్రత్యక్షతలు తీసుకురావచ్చని ఉన్నత స్థితిలో ఉంటారని తెలిపారు. అలాగే కావలి ఏరియా వైద్యశాల సూపరెన్టెంట్ గ్రేడ్-2 జి.లక్ష్మీ ప్రసన్న మాట్లాడుతూ.. నర్సింగ్ శాస్త్రాన్ని నైపుణ్యాలను మెళుకులను నేర్చుకుంటున్న విద్యార్థిని, విద్యార్థులకు ఒకరి ప్రాణం కాపాడితే వాళ్లని హీరో అంటారని అలాగే వంద మంది ప్రాణాలు కాపాడితే వారిని నడుస్ అంటారని వివరించారు. అనంతరం విశ్వదయ రెక్టర్ దొడ్ల వినయ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థి దశలోనే రక్తదాన కార్యక్రమాల్లో విరివిగా పాల్గొనాలని దాని వలన రక్తం ఇచ్చిన వారికి కూడా ఆరోగ్యపరంగా ఎంతో మేలు జరుగుతుందని, రక్తదానం అంటే మరొకరికి ప్రాణదానమని తెలిపారు. ఈ కార్యక్రమంలో జవ హార్ భారతి డిగ్రీ స్వయం ఉపాధి సంచారకులు ఆర్. మాల్యాద్రి, డిగ్రీ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ పి.ప్రసాద్ రెడ్డి నర్సింగ్ కళాశాల అధ్యాపక అధ్యాపకేత్ర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సచివాలయ సిబ్బంది ఫించన్ల పంపిణీ



**సైదాపురం, మేజర్‌న్యూస్ :** మండల కేంద్రంలో ఫించన్ల పంపిణీ కార్యక్రమాన్ని సచివాలయ సిబ్బంది ప్రారంభించారు. సైదాపురంలో ఇవాళ ఉదయం 6 గంటల నుంచి పెన్షన్ల పంపిణీ కార్యక్రమం ప్రారంభమైంది. రాష్ట్రవ్యాప్తంగా 60లక్షలమందికి పైగా ఫించన్లను ప్రభుత్వం పంపిణీ చేయనుంది. 1వ తేదీ రాగానే అవ్వ తాత ముఖంలో చిరునవ్వు సంతోషంతో ఫించన్ల డబ్బులు తీసుకుంటున్న వైనం. అలాగే వితంతు ఫించన్ల సచివాలయ సిబ్బంది ఇవ్వడంతో పెన్షన్ దారులు ఆనందం వ్యక్తపరుస్తున్నారు.

# 95 శాతం ఫించన్లు పంపిణీ పూర్తి



**దుత్తలూరు, మేజర్‌న్యూస్ :** దుత్తలూరు మండలంలో 95శాతం పెన్షన్ల పంపిణీ కార్యక్రమం జరిగిందని ఎంపీడీవో ఎన్.మల్లికార్జున తెలిపారు. మండలంలో జరుగుతున్న పంపిణీ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఎప్పటిలాగే ప్రభుత్వ ఆదేశానుసారం లబ్ధిదారుల వద్దకే వెళ్లి పెన్షన్ పంపిణీ నిర్వహించామన్నారు. నూరు శాతం కార్యక్రమాన్ని నిర్వహించేలా ఆదేశాలు ఇచ్చామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నాజీముల్లా, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# ఫించన్లు పంపిణీ చేసిన ఎంపీడీఓ శ్రీదేవి



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి మండల అభివృద్ధి అధికారి సిహెచ్ శ్రీదేవి మంగళవారం రూరల్ మండలంలోని ఆనెమడు గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి వారు సద్వినియోగం చేసుకోవాలని ఇంకా అర్హులై ఉండి ఎవరికైతే ఈ పెన్షన్లు రావాలో వాటిని దరఖాస్తు చేసుకోవాలని వారు తెలిపారు. వీరితో పాటు సచివాలయం సిబ్బంది కూడా పాల్గొన్నారు.

# నీటితొట్టి నిర్మాణానికి భూమి పూజ



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** మండలంలోని గ్రామాల్లో బహిరంగ ప్రాంతాల్లో పశువులు, మూగ జీవాలు, అడవి జంతువుల దాహర్తిని తీర్చేందుకు ప్రభుత్వం ఉపాధిహామీ పథకం ద్వారా నిర్మించనున్న నీటి తొట్ల నిర్మాణానికి మంగళవారం మండలంలోని శకునాలపల్లెలో ఏపీఓ శ్రీనివాసులు భూమి పూజా కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాల్లో ఉపాధిహామీ పథకంద్వారా వీటిని నిర్మిస్తారన్నారు. మండలానికి 50నీటితొట్లు మంజూరైనాయన్నారు. ఒక్కొనిర్మాణనానికి రూ.37వేలు నిధులు చెల్లిస్తారన్నారు. ఆసక్తిగలవారు వీటిని నిర్మించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో బిఎపి ప్రసన్న, ఎఫ్ఎ సురేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# గురుకులాల్లో ప్రవేశాలకు ధరఖాస్తుల ఆహ్వానం

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** నెల్లూరు జిల్లాలోని నెల్లూరు (అక్కచెరువు), గండిపాళెం, తుమ్మలపెంట ఆత్మకూరు గురుకుల పాఠశాలల్లో 2025-26 విద్యాసంవత్సరానికి 5వతరగతిలో ప్రవేశానికి, మిగిలివున్న తరగతుల్లో ఖాళీల భర్తీకి దరఖాస్తులు ఆశ్వానిస్తున్నట్లు గురకుల పాఠశాలల జిల్లా కన్వీనర్ జి.మురళీ కృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 5 తరగతి, మిగిలిపున్న 6, 7, 8 తరగతుల్లో ప్రవేశం పొందేందుకు అర్హులైన విద్యార్థులు ఆన్ లైన్లో ధరఖాస్తులను ఈనెల 6వ తేది లోపు దాఖలు చేసుకోవాలన్నారు. వీరికి ఈనెల 25న ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

# నేత్రదానం చేసిన వైవి సుబ్బారావు



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి పట్టణం కొత్త బజారు వాస్తవ్యులు వైవి సుబ్బారావు (80) మంగళవారం తెల్లవారుజామున వారి స్వగృహం నందు మరణించారు. సుబ్బారావు నేత్రాలను అభయం దంపతుల అయిన ఈవీఎస్ శ్రీవాణి, వాసవి వనిత లెజెండ్ ప్రెసిడెంట్ దుగ్గిశెట్టి హేమలత వారి సహకారంతో కుటుంబ సభ్యులు వై. వెంకటేశ్వరరావు అంగీకారంతో నెల్లూరు జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు వైవి సుబ్బారావు నేత్రాలను కుటుంబ సభ్యులు దానం చేశారు. మంగళవారం ఎల్వీ ప్రసాద్ ఐ వైద్యశాల టెక్నీషియన్ సునీల్ అందుకొని సర్టిఫికెట్ను అందజేస్తానని తెలిపారు. ఎవరైనా మరణాంతరం నేత్రదానం చేయడానికి స్వచ్ఛంద సేవా సంస్థలను సంప్రదించాలని వారి ఫోన్ నెంబర్లు 9959589321.

# గురువారం రాష్ట్రస్థాయి రెజ్లింగ్ కుస్తీ పోటీలు

**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** ఈనెల 5వ తేదీ నుండి వచ్చే నెల 6వ తేదీ వరకు రాజమహేంద్రవరంలో జరుగు రాష్ట్రస్థాయి రెజ్లింగ్ కుస్తీ పోటీలు జరుగును. ఈ పోటీల్లో పాల్గొనుటకు 15, 20 సంవత్సరాలలోపు బాల బాలికలు అర్హులు, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా జట్టు ఎంపికకు ఈనెల తేది 03-04-2025 గురువారం ఉదయం 10 గంటలకు ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం నందు జరుగును. గ్రీకు రోమన్, ఫ్రీస్టయెల్ నందు ఎంపికలు జరుగును. ఎంపికైన జట్టు రాష్ట్రస్థాయి పోటీలలో జరుగును. వివరాలకు ఈ నెంబర్ 9441644761 సంప్రదించవలెను, జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ ప్రెసిడెంట్, కార్యదర్శి పి.అజయ్ కుమార్, పి.నాగేంద్రరావు పై వివరాలు తెలియజేశారు.

# ముగిసిన పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు

## ఆనందోత్సాహాలలో విద్యార్థులు



**అనుమసముద్రంపేట, మేజర్‌న్యూస్ :** మార్చి 17వ తేదీన ప్రారంభమైన పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు ఏప్రిల్ 1వ తేదీతో ప్రశాంతంగా ముగిశాయి. దాంతో పరీక్షలు రాసిన విద్యార్థులు ఆనందోత్సాహాలతో కేరింతలు కొట్టారు. సంవత్సర కాలం పాటు విద్యార్థులు కష్టపడి చదివిన చదువును మూడు గంటల కాలంలో పరీక్షించుకున్నారు. చివరి పరీక్ష అయిపోగానే విద్యార్థులు ఎంతో ఉల్లాసంగా ఉత్సాహంగా బయటకు పరుగులు తీశారు పరీక్షలు చక్కగా రాశామంటూ ఉత్సాహాన్ని వ్యక్తపరిచారు. బయటకు రాగానే శీతల పానీయాలు ఐస్ క్రీమ్స్ కొనడానికి ఆనందోత్సవంతో వెళ్లారు. ఒకరికి ఒకరు స్నేహ బంధాన్ని గుర్తు చేసుకుంటూ కరచాలనం చేసుకుని బయల్దేరారు. పాఠశాల ఉపాధ్యాయులు తమ పాఠశాల విద్యార్థులు పరీక్షలు బాగా రాశారన్న సంతోషంతో పిల్లలను అభినందించారు. సంవత్సర కాలంగా ఎంతో కష్టపడి చదివి ఈ పరీక్షలు రాశామన్న సంతృప్తితో విద్యార్థులు మంచి ఫలితాల కోసం ఎదురుచూస్తున్నారు. పరీక్షలో ఎంతో ప్రశాంతంగా జరిగినట్లు ఎంఈఓ డి.సాయి ప్రసాద్ తెలిపారు. పదవ తరగతి పరీక్షల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎస్ఐ ఏ సైదులు ఆధ్వర్యంలో తన సిబ్బందిని ఏఎస్ పేటలోని రెండు పరీక్ష కేంద్రాలలో నియమించారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పరీక్షా కేంద్రాల వద్ద అవసరమైన తాగునీరు ఫ్యాన్లు ప్రత్యేక వైద్య శిబిరం తదితర ఏర్పాట్లను కల్పించినట్లు ఎంఈఓ తెలిపారు.

# పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై సమగ్ర విచారణ జరిపించాలి

## పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షులు గడ్డం హనోక్



**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై సమగ్ర విచారణ జరిపించాలని మంగళవారం నెల్లూరు జిల్లా కలెక్టర్ ఆనంద్ ద్వారా పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, వివిధ ఫెలోషిప్ సభ్యులు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు మనవి చేశారు. మార్చి 24వ తేది రాజమహేంద్రవరం కొంతమూరు వద్ద అనుమానాస్పదంగా మృతి చెందిన పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై పూర్తి స్థాయిలో ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా సమగ్ర విచారణ జరిపించాలని పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు.ప్రవీణ్ పగడాల మృతిపై చాలా క్రైస్తవులకు అనుమానాలు ఉన్నాయని వాటన్నిటిని క్షుణ్ణంగా పరిశీలించి అనుమానాలను నివృత్తి చేసి ప్రమాదం కాదు హత్యే అని తేలితే దోషులపై కఠిన చర్యలు తీసుకొని క్రైస్తవ సమాజానికి రక్షణ కల్పించాలని కోరుతున్నారు. అలాగే సోషల్ మీడియాలో మత విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా మాట్లాడుతున్న ఏ సమాజానికి సంబంధిన వారైనా సరే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మనవి చేశారు. ఈ కార్యక్రమంలో పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు గడ్డం హనోక్, జిల్లా అధ్యక్షులు ఆత్మకూరు రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.జాషువా, కోశాధికారి సోడం. ఎనోష్, ఆర్గనైజింగ్ సెక్రటరీ నక్కా సునీల్ గావాస్కర్ సహాయ కార్యదర్శులు ఎం.శ్యామ్, నెల్లూరు రూరల్ పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షులు వెలగపల్లి. క్రాంతి కుమార్, డి.జోన్, పి.భాస్కర్, ఏ.అరుణ్, ఏ.కిరణ్, ఏ.మోసెస్, డి.మోసెస్, బి.మధు, డి.దానియేలు, జి.అబ్రాహం, కె.జాన్ పాల్, ఎన్.సంపత్, పి.జాన్‌పాల్, జె.చైతన్య, పి.పాల్, ఇమ్మానుయేల్ తదితరులు పాల్గొన్నారు.

## స్పెషల్ డ్రైవ్ నిర్వహించిన వన్‌టౌన్ సీఐ ఫిరోజ్



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి ఒకటో పట్టణ పరిధిలో మైనర్ బాలురు డ్రైవింగ్ చేస్తున్న వారిపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి మంగళవారం వారి ద్విచక్ర వాహనాలతో సహా కావలి ఒకటో పట్టణ పోలీస్ స్టేషనకి వారిని తీసుకువచ్చి, వారికి కౌన్సిలింగ్ ఇవ్వడం జరిగింది. వారి తల్లిదండ్రులను పిలిపించి వారికి కూడా కౌన్సిలింగ్ ఇవ్వడం జరిగింది అనంతరం వన్ టౌన్ సిఐ మాట్లాడుతూ.. ఎవరైనా తల్లిదండ్రులు వారి కుమారులు మైనర్ అయితే ద్విచక్ర వాహనం ఇవ్వద్దని వారి తల్లిదండ్రులకు తెలిపారు. అలాగే ప్రస్తుతం మైనర్ బాలురు ద్విచక్ర వాహనం మీద ఇష్టానుసారంగా స్పీడుగా వెళ్లడం ప్రమాదాలకు గురి కావడం తరచూ జరుగుతున్నాయి. ఈ ప్రమాదంలో అరికట్టేందుకే ఈ స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ఒకటో పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ తెలిపారు. కావలి పట్టణ ప్రజలకు ముఖ్యంగా మైనర్ బాలురుల తల్లిదండ్రులు ద్విచక్ర వాహనాన్ని ఎట్టి పరిస్థితుల్లో ఇవ్వకూడదని అలా ఇచ్చినట్లయితే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేయాల్సి వస్తుందని పదేపదే వారికి వివరించడం జరిగింది.

## 94శాతం ఫించన్లు పంపిణీ పూర్తి : ఎంపీడీఓ



**అనంతసాగరం, మేజర్‌న్యూస్ :** అనంతసాగరం మండలంలో మంగళవారం సాయంత్రానికి 94శాతం ఫించన్లు పంపిణీ కార్యక్రమం జరిగిందని ఎంపీడీవో ఐజాక్ ప్రవీణ్ తెలిపారు. మండలంలో జరుగుతున్న పంపిణీ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఎప్పటిలాగే ప్రభుత్వ ఆదేశానుసారం లబ్ధిదారుల వద్దకే వెళ్లి పెన్షన్ పంపిణీ నిర్వహించామన్నారు. మండలంలో మొత్తం 6054 ఫించన్లకు గాను 5724 మందికి వివిధ రకాల పెన్షన్లు అందజేశామన్నారు. బుధవారం నూరు శాతం కార్యక్రమాన్ని నిర్వహించేలా ఆదేశాలు ఇచ్చామని ఆయన తెలిపారు.

## జిల్లా గ్రంథాలయ సంస్థ పర్సన్ ఇన్‌చార్జ్‌గా జేసీ

**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** జిల్లా గ్రంథాలయ సంస్థ పర్సన్ ఇన్‌చార్జ్‌గా జాయింట్ కలెక్టర్ కార్తీక్‌ను నియమించారు. రాష్ట్రంలోని పలు గ్రంథాలయాలకు సంబంధించి పర్సన్ ఇన్‌చార్జ్‌లను నియమించారు. అందులో భాగంగా నెల్లూరుకు సంబంధించి ఈ మేరకు ఉత్తర్వులు జారీచేశారు.

## ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ పరిశీలన ఎంపీడీఓ



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు మండలంలో మంగళవారం ఉదయం 7గంటల నుండి ఫించన్ల పంపిణీ ప్రారంభమైంది. మండలం లోని అన్ని సచివాలయాల సిబ్బంది, ప్రజా ప్రతినిధులు ఈ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. వృద్ధాప్య వితంతు వికలాంగులు మొదలైన వారికి సంబంధించిన 4817 ఫించన్లకు గాను రెండు కోట్ల ఎనిమిది లక్షలు రూపాయలను ప్రభుత్వ ఆదేశాలను అనుసరిస్తూ లబ్ధిదారుల ఇండ్ల వద్దనే వారికి పెన్షన్ అందించడం జరిగింది. ఈరోజు మండలంలో 4571 మందికి వృద్ధాప్య వితంతు వికలాంగులు మొదలైన ఫించన్లు అందజేయడం జరిగిందని ఎంపీడీవో పి.ఐజాక్ ప్రవీణ్ తెలిపారు. మహిమలూరు గ్రామంలో ఆయన పెన్షన్ పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించారు. మొదటి రోజున మండలంలో 95శాతం పెన్షన్ పంపిణీ చేయడం జరిగిందని ఎంపీడీవో తెలిపారు. మిగిలిన వారికి బుధవారం కూడా ఫించన్లు పంపిణీ చేయడం జరుగుతుందని ఎంపీడీవో తెలిపారు. మహిమలూరు గ్రామంలో ఎంపీడీవో వెంట పంచాయతీ కార్యదర్శి, వెల్ఫేర్ అసిస్టెంట్, డిజిటల్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

## ప్రశాంతంగా ముగిసిన పదవ తరగతి పరీక్షలు



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** పట్టణంలో మంగళవారంతో పదవ తరగతి పరీక్షలు ముగిశాయి. పట్టణంలోని ఆరు కేంద్రాలలో పదో తరగతి పరీక్షలు పూర్తయి పరీక్ష కేంద్రాల నుండి విద్యార్థులు ఎంతో సంతోషంగా బయటికి రావడం కనిపించింది. విద్యార్థుల కోసం పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థుల తల్లిదండ్రులు నిరీక్షించారు. పదవ తరగతి పరీక్షలు కావడంతో ఇటు విద్యార్థులలో వారి తల్లిదండ్రులలో కూడా ఈ పరీక్షలు జరిగినన్ని రోజులు ఆందోళనతో ఉన్నారు. నేటితో పరీక్షల ప్రశాంతంగా ముగియడంతో ఆనందంగా పరీక్ష కేంద్రాల నుండి ఇళ్లకు తరలి వెళ్లారు.

## వీర్ల కొల్లులో పింఛన్లు పంపిణీ చేయించిన చల్లా



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** ఎన్టీఆర్ భరోసా పింఛన్లను మంగళవారం జిల్లా తెలుగుదేశం కార్యనిర్వాహక కార్యదర్శి చల్లా వెంకటేశ్వర్లు దగ్గరుండి సచివాలయ పశు సహాయకులు శేఖర్ చేపంపిణీ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ ప్రకారం ప్రతి నెల ఒకటవ తేదీన ఏ మాత్రం ఆలస్యం చేయకుండా పంపిణీ చేస్తున్నారని తెలుగుదేశం ప్రభుత్వం చేతల ప్రభుత్వమేనని నిరూపించారన్నారు. అదేవిధంగా ఎమ్మెల్యే కాకర్ల సురేష్ నియోజకవర్గం అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. ఆయనకు మనందరం సహకారం అందించి మన నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు సహకరించాలన్నారు. పింఛన్లు అందించడం ద్వారా వృద్ధులు వితంతువులు వికలాంగులు ఎంతో సంతోషాన్ని పొందుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు గ్రామస్తులు ఉన్నారు.

# కొనుగోలు కేంద్రాలతో దగా పడ్డ ధాన్యం రైతులు

## ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు పట్టణం లో సిపిఎం పార్టీ కార్యాలయంలో మంగళవారం నెల్లూరు జిల్లా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి స్థానిక సంఘ నేతలతోపాటు జిల్లా అధ్యక్షులు పులిగుండ్ల. శ్రీరాములు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఇటీవల ప్రభుత్వం రైతుల నుండి ధాన్యం కొనుగోలు చేసే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన పలు ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా రైతులకు ఏమాత్రం ఉపయోగకరంగా లేదని ధాన్యం కొనుగోలు కేంద్రాల పేరిట రైతులను మోసం చేస్తూ అధికారులే ధాన్యం కొనుగోలు చేసిన వ్యవహారంలో భారీ కుంభకోణం జరిగిందని ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నెల్లూరు జిల్లా అధ్యక్షులు శ్రీరాములుతో పాటు జిల్లా కౌలు రైతుల సంఘం నాయకులు లక్ష్మీపతి, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు లక్కు కృష్ణ ప్రసాద్, అనంతసాగరం రైతు సంఘం కార్యదర్శి మస్తాన్ తదితరులు పాల్గొన్నారు. రైతు ధాన్యం కొనుగోలు కేంద్రాల వల్ల లాభం కన్నా నష్టమే ఎక్కువ జరిగిందని ఆరోపించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు పెట్టినట్లు చెబుతూ ఉన్న రైతులకు కల్పించవలసిన మౌలిక వసతులు కల్పించకపోవడంతో ఆశించిన స్థాయిలో రైతులు ధాన్యం అమ్ముకోలేక పోయారన్నారు. ప్రభుత్వం మాటలలో తప్ప చేతలలో ఆచరణ లేకపోవడం వల్ల ధాన్యపు పండించిన రైతులు దళారులకు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆరోపించారు. ధాన్య బస్తాలు అందించలేక, తేమశాతం గుర్తింపులో తేడా కారణంగా, ధాన్యం తరలించేందుకు వాహనాలు అందించలేక పోవడంతో రైతులు తమ ధాన్యాన్ని ప్రభుత్వానికి ఇచ్చే వసతి లేక తక్కువ ధరకే దళారులకు అమ్ముకోవాల్సినపరిస్థితి ఏర్పడిందని వారు తెలిపారు. నిన్నటితో రబి ధాన్యం కొనుగోలు పూర్తి అయిన మిగిలిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వం కొనుగోలు చేస్తామని చెప్పడం సంతోషకరమైన విషయమైనా తప్పనిసరిగా ప్రతి ధాన్యపు గింజను ప్రభుత్వం కొనుగోలు చేయాలని వారు డిమాండ్ చేశారు. నెల్లూరు జిల్లా పరిధిలో ధాన్యం కొనుగోలు విషయంలో మిల్లర్లు, దళార్లు కుమ్మక్కై భారీ కుంభకోణం నెరపి కోట్లాది రూపాయలు రైతులకు చెందవలసిన సొమ్ము దోపిడీ జరిపారని దీనితో రైతులు నష్టపడ వలసి వచ్చిందని దీనిపై సమగ్ర విచారణ జరిపి న్యాయం చేయాలనీ వారు కోరారు.

# గ్రామ దేవతలు మారెమ్మ సహిత తాళ్ల పరమేశ్వరిలకు చద్ది నైవేద్యం



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** గ్రామదేవతలైన మారెమ్మ సహిత తాళ్ల పరమేశ్వరి కొలువులో భాగంగా మంగళవారం ముత్తుకూరు గ్రామ పంచాయతీ యాదవ వీధిలో దైవ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. మంగళవారం ఈ కార్యక్రమాలు జరిగినాయి. వేపచెట్టు వద్ద చద్ది నైవేద్యం, సలిపిండి పానకాలు గ్రామ దేవతలకు నైవేద్యంగా సమర్పణ చేశారు. మేళ తాళాలు, మంగళ వాయిద్యాలతో గ్రామస్తులు ఈ కార్యక్రమాన్ని జరిపారు. నాయకులు ఈదురు రామ్మోహన్ రెడ్డి, కె.రవీంద్రరెడ్డి, కృష్ణారెడ్డి, శ్రీనివాసులు రెడ్డిలు గ్రామదేవతలకు పూజా కార్యక్రమాలు చేశారు. పెద్ద గొల్ల ముంగమూరు నాగేశ్వరరావు, సుంకర వెంకటేశ్వర్లు, బొలిగర్ల శ్రీనివాస్ యాదవ్, కమిటీ సభ్యులు పి.రాము, ఎం.శీనయ్య, డి.ప్రసాద్, ఎం.శివ, పి.ప్రసాద్, జి.నాగరాజు, యాదవ వీధి గ్రామస్తులు తదితరుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు నిర్వహించారు. గంగపెట్టె రామోత్సవాన్ని ఘనంగా జరిపారు. సంప్రదాయపద్ధంగా జరిగిన ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. విచ్చేసిన భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# సీఐటీయు ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు ధర్నా




**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో పని చేస్తున్న కార్మికుల, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని మంగళవారం ఉదయం ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయు) ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు కార్పొరేషన్ కార్యాలయం ఎదుట నిరసన ధర్నా చేపట్టారు. సమస్యల తీవ్రతను డిప్యూటీ కమిషనర్ చెన్నుడుకు సీఐటీయూ నాయకులు వివరించారు. ఆప్కాస్ ను రద్దు చేసి సంవత్సరాల తరబడి నుండి చేస్తున్న మున్సిపల్ కార్మికుల ఉద్యోగాలను ప్రైవేటు ఏజెన్సీలకు, కాంట్రాక్టర్లకు అప్పగిస్తే ఊరుకోబోమని తెలిపారు. 60 సంవత్సరాలు పూర్తయ్యాయి అనే నెపంతో నెల్లూరు నగరపాలక సంస్థలో అనేక సంవత్సరాల నుండి పనిచేస్తున్న 93 మంది ఆప్కాస్ ఉద్యోగులను హఠాత్తుగా నగరపాలక సంస్థ అధికారులు నిలిపివేసారని తెలిపారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఏమీ లేకుండా, వారసులకు ఉద్యోగాలు ఇవ్వకుండా, ఏ నోటీసులు ఇవ్వకుండా హఠాత్తుగా సంవత్సరాల తరబడి చేస్తున్న ఉద్యోగాల నుండి నిలిపివేయడం అన్యాయం అని సీఐటీయూ నాయకులు తెలిపారు. మలినాలు, మురికి, చెత్త, చెదారం, వైరస్‌ల మధ్య నిరంతరం పనిచేస్తూ, ఆరోగ్యాలను పణంగా పెట్టి నగర ప్రజల ఆరోగ్యాలను కాపాడుతున్న వారి పట్ల ప్రభుత్వం చిన్న చూపు చూడడం తగదన్నారు. చాలీ చాలని జీతాలు - అప్పులతో బతుకులీడుస్తున్న వారిపై నిర్లక్ష్య వైఖరి మార్చుకోవాలన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇచ్చి, వారసులకు ఉద్యోగాలు ఇచ్చేంతవరకు భేషరతుగా ఉద్యోగాలలో కొనసాగించాలని డిమాండ్ చేశారు.సమస్యల పట్ల రాష్ట్ర ప్రభుత్వం, నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు,పాలకులు నిర్లక్ష్య వైఖరి వీడకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయు) హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయు) గౌరవాధ్యక్షులు కత్తి శ్రీనివాసులు, సీఐటీయూ నాయకులు కె.పెంచల నరసయ్య, సీఐటీయు నెల్లూరు నగర కార్యదర్శి జి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# పింఛన్ పంపిణీ ఎంపీడీవో పరిశీలన



**అనుమసముద్రంపేట, మేజర్‌న్యూస్ :** ఏఎస్ పేట మండలం కావలి యడవల్లి గ్రామంలో మంగళవారం ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమాన్ని ఎంపీడీవో ప్రసన్నకుమారి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. ఏఎస్ పేట మండలంలో అన్ని గ్రామ పంచాయతీలలో మంగళవారం ఉదయం ఏడు గంటల నుంచి పెన్షన్ పంపిణీ కార్యక్రమాన్ని సచివాలయ సిబ్బంది నిర్వహిస్తున్నారని తెలిపారు. ప్రతి పింఛన్ ధారుని ఇంటికి వెళ్లి పంపిణీ చేస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా కావలిఎడవల్లి గ్రామంలో టీడీపీ నాయకులు జిల్లా తెలుగు యువత మాజీ అధ్యక్షులు ఏలూరి మాల్యాద్రి నాయుడు దగ్గర ఉండి ఎన్టీఆర్ పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఇంటికి తిరుగుతూ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది మండల నాయకులు పాల్గొన్నారు.

# ఫించన్ల పంపిణీని తనిఖి : డీఆర్‌డీఏ పీడీ



**పొదలకూరు, మేజర్‌న్యూస్ :** ఎలాంటి అవినీతి, అవకతవకలకు తావు లేకుండా జిల్లాలో పెన్షన్ల పంపిణీ పారదర్శకంగా జరుగుతోందని డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ నాగరాజ కుమారి పేర్కొన్నారు. పొదలకూరులో మంగళవారం ఉదయం ఫించన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఆమె తనిఖీ చేశారు. పొదలకూరు పంచాయతీ పరిధిలోని వెంకటేశ్వరపురం కాలనీలో సచివాలయ సిబ్బంది స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పెన్షన్ల మొత్తాన్ని కొంతమందికి అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా 132కోట్ల మొత్తాన్ని మూడు లక్షల 6వేల మంది లబ్ధిదారులకు ప్రతి నెల ఒకటో తేదీన అందించేలా ప్రభుత్వం అన్నిచర్యలు చేపట్టిందని చెప్పారు. ఫించన్ల పంపిణీ ప్రక్రియ స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో సచివాలయ సిబ్బందిచే లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి అందించడం జరుగుతోందని తెలిపారు. కార్యక్రమంలో వెలుగు ఏపిఎం చిన్నయ్య, సిసి దయాకర్, పొదలకూరు పట్టణ టీడీపీ అధ్యక్షులు బొద్దులూరు మల్లికార్జున్ నాయుడు, నాయకులు నారపనాయుడు, తల్లిక ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# మర్రిపాడులో ముగిసిన పది పరీక్షలు



**మర్రిపాడు, మేజర్‌న్యూస్ :** మర్రిపాడు పరీక్ష కేంద్రాల్లో పది పరీక్షలు మంగళవారంతో ముగిశాయి. మండల కేంద్రమైన మర్రిపాడులో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలలను పదో తరగతి పరీక్షా కేంద్రాలుగా గుర్తించి అధికారులు పరీక్షలను నడిపారు. మండల పరిధిలోని నందవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలతో పాటుగా మోడల్ స్కూల్ పొంగూరు, చిలకపాడు, కదిరినాయుడుపల్లి, చుంచులూరు, మర్రిపాడు పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఈ పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు రాశారు. ఏది ఏమైనాప్పటికీ పరీక్షా కేంద్రాల వద్ద స్థానిక ఎస్ఐ శ్రీనివాసరావు 144 సెక్షన్‌ను విధించి కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయడంతో పది పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి.

# సర్ చార్జీల పేరిట చేసే దోపిడిని అరికట్టాలి

**దళిత సంఘర్షణ సమితి అధ్యక్షులు మల్లి**




**కావలి, మేజర్‌న్యూస్ :** జాతీయ బ్యాంకులు సర్ చార్జీల పేరిట చేసే దోపిడిని అరికట్టాలని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షులు ఎస్.మల్లీ తెలిపారు. మంగళవారం ఆర్డీఓ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి, అనంతరం ఆర్డిఓ వంశీ కృష్ణకు పలు సమస్యలపై వినతి పత్రం అందించారు. అనంతరం మల్లి మాట్లాడుతూ.. ఇటీవల జాతీయ బ్యాంకులు సర్ చార్జీల పేరిట దళిత గిరిజన బడుగు వర్గాలను ఆర్థికంగా కృంగదీస్తున్నాయని తెలిపారు. ఒకప్పుడు జాతీయ బ్యాంకులు పేదవారికి రుణాలు ఇచ్చి ఇందిరా గాంధీ సాయంతో ఎంతోమంది బడుగు వర్గాల అభివృద్ధికి చేయూతని ఇచ్చారని తెలిపారు. అలాంటి బ్యాంకులు ఇప్పుడు దోపిడీ కేంద్రాలుగా మారయని తెలిపారు. ఉపాధి కూలీల డబ్బులు బ్యాంకులో పడితే సగానికి సగం ఇస్తున్నారని తెలిపారు. అలాగే గ్యాస్ సబ్సిడీ డబ్బులు కూడా బ్యాంకులు కట్ చేసుకుంటున్నాయని తెలిపారు. పేదవారు బతికే పరిస్థితుల్లో లేకుండా బ్యాంకులు దోపిడీ చేస్తున్నాయని ఈ విషయంపై ఉన్నత అధికారులు తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో జరుగుమల్లి విజయరత్నం, చౌటూర్ లక్ష్మయ్య, నాగబోయిన భాస్కర్, ఎం.లక్ష్మి, జెడ్డా వాసు, ఆలూరు బ్రహ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

# పాస్టర్ పగడాల ప్రవీణ్ అనుమానస్పద మృతిపై నిరసన ర్యాలీ




**బోగోలు, మేజర్‌న్యూస్ :** బోగోలు మండల పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్యామ్ సన్ బాబు ఆధ్వర్యంలో శాంతి నిరసన ర్యాలీ నిర్వహించారు. పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతికి మద్దతుగా మంగళవారం బోగోలు మండలంలోని పాస్టర్స్ అసోసియేషన్ సభ్యులు, సంఘ పెద్దలు, సంఘ కాపరులు, సంఘ సిస్టర్స్ యువతి, యువకులు సుమారు 500 మందితో విశ్వనాథరావుపేట పంచాయతీ ఇబ్రహీంపేట పెట్రోల్ బంకు నుండి బోగోలు అంబేద్కర్ విగ్రహం వరకు కొవ్వొత్తులతో భారీ శాంతి నిరసన ర్యాలీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బోగోలు మండల పాస్టర్స్ అధ్యక్షులు శ్యామ్ సన్ బాబు మాట్లాడుతూ పాస్టర్ ప్రవీణ్ పగడాల ను ఉద్దేశపూర్వకంగానే చంపారని, ఆయన మరణం యావత్ క్రిస్టియన్ సోదరుల మనసులను కలిసివేసిందని, భారత రాజ్యాంగం భావ ప్రకటనను కల్పించిందని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఒక మతానికి మాత్రమే మద్దతు ఇస్తూ భారత రాజ్యాంగాన్ని అనుసరించడం లేదని తెలిపారు. ఒక ప్రవీణ్ చంపితే వందల ,వేలమంది ప్రవీణ్‌లు పుడతారని, ప్రశ్నించే గొంతును నొక్కేయాలని చూడ్డం సరికాదని, క్రిస్టినాల్టీ అంటే ఒక మతం కాదని, ఒక మార్గమని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని అన్నారు. ప్రవీణ్ పగడాల మృతిపై ప్రభుత్వం సమగ్ర సీబీఐ దర్యాప్తు చేసి ప్రవీణ్ కుటుంబానికి, యావత్ క్రిస్టియన్ సోదరులకు న్యాయాన్ని చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ సిహెచ్, నాగరాజు, ట్రెజరీ రవికుమార్, పాస్టర్లు రెవరెండ్ డానియల్ బాబు, ఇమ్మానియేలు, ఎల్ సుదీర్ బాబు, రమేష్ బాబు, చంద్రహాస్, జీవన్ కుమార్, డేవిడ్ పాల్, పౌలయ్య, ఫిలిప్, సాల్మన్ రాజ్, జాన్సన్, జార్జ్, అనిల్, ఎస్ఐ బొజ్జ నాయక్, సిస్టర్స్, పాస్టర్ పామర్తి ప్రవీణ్, యువకులు, సంఘ కాపర్లు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఫిషింగ్ జెట్టి సందర్శనకు ఎమ్మెల్యే సోమిరెడ్డి రాక



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** మండలంలోని నేలటూరు పాలెం సముద్ర తీర ప్రాంతాన ఉన్నటువంటి ఫిషింగ్ జెట్టి సందర్శనకు సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి బుధవారం వస్తున్నట్లు ఆయన కార్యాలయం మంగళవారం తెలిపింది. ఉదయం 9 గంటలకు ఎమ్మెల్యే చేస్తారని పేర్కొంది. స్థానిక అధికార పార్టీ నాయకులు, మత్స్యకారులు రావాలని సూచించింది.

**భూములు కోల్పోయిన..**

# రైతులకు నష్టపరిహారం ఇవ్వాలి

**ఆర్డీవోకు రైతుసంఘ విన్నపం**



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** భారతమాల 67వ జాతీయరహదారికి భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం, రైతుకూలీసంఘం, సిఐటియు నాయకులు కోరారు. అనంతసాగరం మండలంలోని పలువురు రైతులతో నాయకులు ఈమేరకు మంగళవారం ఆత్మకూరులో ఆర్డీవో భూమిరెడ్డి పావనికి ఒక వినతిపత్రం అందజేసి వివరాలు తెలిపారు. జాతీయ రహదారికోసం అనంతసాగరం మండలం అమానిచిరువెళ్ళ, ఇనగలూరు, బెడుసుపల్లి, పాతదేవరాయపల్లి గ్రామాల రైతులు భూములు కోల్పోయారన్నారు. వారికి 2013 భూసేకరణ చట్టం ద్వారా నష్టపరిహారం అందజేయాలని నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం, రైతుకూలీసంఘం, కౌలురైతుసంఘం, సిఐటియు నాయకులు ఎం.పుల్లయ్య, జి.లక్ష్మిపతి, అన్వర్‌బాషా, రైతులు పుల్లారెడ్డి, ప్రసాద్‌రెడ్డి, బొందల వెంకటేశ్వర్లురెడ్డి, జి.పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

**దేవరతిప్ప నుండి గ్రావెల్ తరలింపు**

# ప్రభుత్వ ఖజానాకు భారీ గండి

- పొట్టకూటి కోసం పోయిన కూలీలపై కేసులు నమోదు
- తూతూ మంత్రంగా అధికారులు చర్యలు
- అయినవారికి రెడ్ కార్పోరేట్ కాని వారికి కేసుల బహుమానం
- రోడ్డు కాంట్రాక్టర్ గుత్తే దారులకు కొమ్ముకాస్తున్న అధికారులు



**సైదాపురం, మేజర్‌న్యూస్ :** సైదాపురం మండలంలోని రెవిన్యూ కార్యాలయం పైభాగాన దేవరతిప్ప ప్రాంతంలో నెల క్రితం చిన్న చిన్న పలుకు రాళ్లు ఏరుకుంటున్న కూలీలపై కేసులు నమోదు చేశారు. రాపూరు పొదలకూరు క్రాస్ రోడ్ నుండి మండల కార్యాలయం వరకు నిర్మిస్తున్న సీసీ రోడ్డుకు ఇరువైపులా గ్రావెల్‌ను మంగళవారం దేవరతిప్ప ప్రాంతం నుండి రియల్ ఎస్టేట్‌కి, రోడ్డుకి తరలించి సొమ్ము చేసుకుంటున్న రోడ్డు కాంట్రాక్ట్ దారులపై ఎలాంటి చర్యలు తీసుకోని మండల స్థాయి రెవెన్యూ అధికారులు.



నెల్లూరు జిల్లా సైదాపురం మండలంలో రూపాయి కూడా పెట్టుబడి లేకుండా ఇబ్బడిముబ్బడిగా ఆదాయం వస్తుండడంతో అక్రమార్కులు ఎక్కడపడితే అక్కడ గ్రావెల్ తవ్వేస్తున్నారు. గతంలో కొంతమంది వైసీపీ నాయకులు, వీరితో చేతులు కలిపి భారీ మొత్తంలో కూడబెట్టుకున్నారు. అక్రమార్కులు ఇప్పుడు కూటమి పార్టీలకు చెందిన కిందిస్థాయి నాయకులతో లోపాయికారి ఒప్పందాలు చేసుకుని గ్రావెల్, మట్టి తవ్వకాలు, రవాణా చేస్తున్నారు.

**మొక్కుబడి చర్యలు :** ప్రభుత్వ భూముల్లో యథేచ్ఛగా మట్టి, గ్రావెల్ తవ్వకాలపై పోలీసు, రెవెన్యూ, గనుల శాఖల అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నా పట్టించుకో వడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. మొక్కుబడిగా దాడులు నిర్వహించి గ్రావెల్ తరలిస్తూ ట్రాక్టర్లు, లారీలు పట్టుబడితే అరకొరగా జరిమానా విధించి వదిలేస్తున్నారు. ఒకవేళ్ల రాత్రి గస్తీ పోలీసులు గ్రావెల్ రవాణా చేస్తున్న వాహనాలను పట్టుకుంటే స్థానిక నేతల ఒత్తిళ్లతో వాహనాలను విడిచిపెట్టేస్తున్నారు. ఇటువంటి సంఘటనలు నెల్లూరు జిల్లా సైదాపురం మండల పరిధిలో అధికంగా జరుగుతున్నాయి.

▶▶మండలంలో గ్రావెల్ అక్రమ తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. అక్రమార్కులకు అధికార పార్టీ నేతల అండదండలు ఉండడంతో అధికారులు పట్టించుకో వడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. కొండలను పిండి చేసి దర్జాగా గ్రావెల్‌ను తరలించుకుపోతున్నా పట్టించుకునే నాథుడు కరువయ్యాడని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

▶▶మండలంలోని మండల రెవిన్యూ కార్యాలయానికి పైబాగాన దేవరతిప్ప ప్రాంతాల్లో గ్రావెల్ అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. అటు ఎంపీడీవో కార్యాలయం, తహసిల్దార్ కార్యాలయం వాటిని ఆనుకుని ఉన్న కొండ ప్రాంతాల్లో దర్జాగా అనధికార తవ్వకాలు జరుగుతున్నాయి. ఇంత జరుగుతున్నా, రెవెన్యూ, గనుల శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని ఇదంతా కూడా పట్టపగలు తోలుతున్నప్పటికీ మండల స్థాయి అధికారులు చూసిచూన్నట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తపరిచారు. పై విషయంపై తహసిల్దార్‌ని వివరణ కోరగా ప్రభుత్వ పనులకు ప్రభుత్వ పర్మిషన్ అవసరం లేదని తెలిపారు. మండల ఆర్ఐ ప్రదీప్‌ను వివరణ కోరగా.. కర్ర ఇరగక పాము చావక అన్నట్లు సమాధానం ఇవ్వడం అనంతరం రిపోర్టర్ మొబైల్ నెంబర్ బ్లాక్‌లో పెట్టేయడం జరిగింది. ప్రభుత్వ ఖజానాకు ప్రభుత్వ అధికారులే గండి కొడుతున్నారని, ఉన్నతాధికారులు స్పందించి ప్రభుత్వ ఖజానాను కాపాడాలని మండల ప్రజలు కోరుతున్నారు.

# వేసవిలో ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలి



**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** వేసవి తీవ్రత దృష్ట్యా ప్రజలకు ఇబ్బందులు లేకుండా అన్ని శాఖల అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆనంద్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉదయం కలెక్టరు వారి ఛాంబర్‌లో రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఆధ్వర్యంలో ఎండతీవ్రతకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చేపట్టాల్సిన కార్యక్రమాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వేసవి ఉష్ణోగ్రతలు, వడగాల్పులపై ఎప్పటికప్పుడు ప్రజలకు సమాచారం ఇస్తూ గ్రామాల్లో అవగాహన కల్పించాలన్నారు. అన్ని ఆసుపత్రుల్లో, 108 వాహనాల్లో ఐస్‌ప్యాక్స్, ఒఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో వుంచుకోవాలని వైద్యారోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. ఉపాధిహామీ పని ప్రదేశాల్లో కూలీలకు ఇబ్బందులు లేకుండా తాగునీరు, ఒఆర్ఎస్ ప్యాకెట్లు ఉంచాలని డ్వామా అధికారులకు సూచించారు. ఆర్టీసీ బస్టాండ్లలో ప్రయాణికుల సౌకర్యార్థం చలివేంద్రాలు, బస్సుల్లో వాటర్ క్యాన్లు ఏర్పాటుచేయాలని ఆర్ఎంకు సూచించారు. గ్రామస్థాయిలో డ్వాక్రా సంఘాల ద్వారా సభ్యులకు అవగాహన కల్పించాలన్నారు. గ్రామాల్లో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా అన్ని చేతిపంపులు సక్రమంగా పనిచేసేలా చూడాలని, ఎక్కడైనా పనిచేయకుంటే వెంటనే మరమ్మతులు చేపట్టాలని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులను ఆదేశించారు. వ్యవసాయ పనులకు వెళుతున్న కూలీలకు గ్రామవ్యవసాయ సహాయకుల ద్వారా మంచినీటి సౌకర్యం కల్పించాలని జిల్లా వ్యవసాయాధికారికి సూచించారు. కరెంటు కోతలు, షార్ట్‌సర్క్యూట్ లేకుండా విద్యుత్‌శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. మేతకు వెళుతున్న పశువులకు తాగునీటి దప్పిక తీర్చేందుకు నీటివసతి అందుబాటులో వున్న ప్రదేశాలను ఎంపిక చేసిన నీటితొట్లెలు ఏర్పాటుచేయాలని పశు సంవర్ధకశాఖ జేడీకి సూచించారు. వేసవి ఉష్ణోగ్రతలు, వడగాల్పుల సమాచారాన్ని ఎప్పటికప్పుడు పత్రికలు, ప్రసార మాధ్యమాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించి తగిన ముందస్తు జాగ్రత్తలు తీసుకునేలా చర్యలు చేపట్టాలని సమాచారశాఖ డీడీని ఆదేశించారు. అన్నిశాఖల అధికారులు కూడా ఆయా శాఖల పరిధిలో కనీసం పది చలివేంద్రాలను ఏర్పాటు చేసి ఫొటోగ్రఫీలు పంపాలని జిల్లా అధికారులను ఆదేశించారు. అనంతరం వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రూపొందించిన బ్యానర్ ను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో డిఆర్‌వో ఉదయభాస్కర్‌రావు, జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుజాత, వ్యవసాయ, పశుసంవర్ధకశాఖ జేడీలు సత్యవాణి, రమేష్‌నాయక్, ఆర్‌టిసి ఆర్ఎం మురళీబాబు, విద్యుత్‌శాఖ ఈఈ ఎం శ్రీధర్, డ్వామా ఎపివో కనకదుర్గాభవాని, డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్‌వో ఖాదర్‌వల్లి, ఐడిఎస్‌పి జిల్లా కోఆర్డినేటర్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ భరోసా పింఛన్లను పంపిణీ చేసిన ఎమ్మెల్యే కాకర్ల

## విద్యుత్ షాక్‌కు గురైన బాధితుడికి పరామర్శ, అండగా ఉంటానని భరోసా



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** వింజమూరు పంచాయతీలోని జిబికెఆర్ ఎస్టీ కాలనీలో మంగళవారం ఎన్టీఆర్ భరోసా పింఛన్లను ఎమ్మెల్యే కాకర్ల సురేష్ చేతులు మీదుగా అందజేశారు. స్థానిక మండల అధికారులు నాయకులతో కలిసి కాలనీలోని వికలాంగులు వితంతువు డయాలసిస్ పేషంట్ల పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కాలనీవాసులు విద్యుత్ సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఆ సమస్యను పరిష్కరించాలని విద్యుత్ శాఖ అధికారులకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. అదే విధంగా ఆ కాలనీలో విద్యుత్ షాక్‌కు గురైన బాధితుడిని పరామర్శించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి వైద్యం అందించాలని తెలియజేశారు. అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. టిడిపి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎన్నికల హామీలో ఇచ్చిన 4000 పింఛన్లను ప్రతినెల ఒకటో తేదీన అందజేస్తున్నామని తెలిపారు. త్వరలోనే తల్లికి వందనం అందజేయడం జరుగుతుందన్నారు. రాష్ట్రంలోని రోడ్లన్నీ యుద్ధ ప్రాతిపదికన వేయడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సారధ్యంలో యువనేత విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ నేతృత్వంలో రాష్ట్రం అభివృద్ధి సంక్షేమంలో దూసుకుపోతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ గొంగటి రఘునాథరెడ్డి సర్పంచ్ నల్లగొండ సృజన మాజీ కన్వీనర్ గూడా నర్సారెడ్డి మాజీ సొసైటీ అధ్యక్షులు జూపల్లి రాజారావు సీనియర్ నాయకులు వనిపెంట సుబ్బారెడ్డి గువ్వల కృష్ణారెడ్డి బిజెపి నియోజకవర్గ ఇన్చార్జ్ కదిరి రంగారావు ఎంపీటీసీ సభ్యురాలు యాకసిరి భవాని పట్టణ అధ్యక్షులు కోడూరు నాగిరెడ్డి వసంతరావు డేగ మధు యాదవ్ తిరుపతి ఆచారి ఎంపీడీవో శ్రీనివాసులురెడ్డి పంచాయతీ కార్యదర్శి శివకుమార్ సచివాలయం సిబ్బంది తదితరులు ఉన్నారు.

# ముగిసిన పదవ తరగతి పరీక్షలు




**జలదంకి, మేజర్‌న్యూస్ :** గత 15 రోజులు క్రితం ప్రారంభమైన పదవ తరగతి పరీక్షలు ఏప్రిల్ ఒకటి మంగళవారంతో ముగిశాయి. పరీక్షల ప్రారంభం నుండి ఎంతో శ్రద్ధగా చదివి పరీక్షలు రాసి చివరి రోజు విద్యార్థులు బయటికి రావడంతో వారు ఉల్లాసంగా ఉత్సాహంగా కనిపించారు. తాము గత 15రోజులుగా ఎంతో పట్టుదలతో చదివి పరీక్షలు రాశామని విద్యార్థిని విద్యార్థులు అభిప్రాయాలు వెలిబుచ్చారు. చివరి రోజు పరీక్ష అనంతరం విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పరీక్ష కేంద్రం నుండి బయటికి వచ్చారు అనంతరం ఐస్ క్రీమ్ షాపుల వైపు కూల్ డ్రింక్ షాప్‌ల వైపు పరుగులు తీశారు. పరీక్షలు అయిపోయాయనన్న ఆనందం వారిలోకనిపించింది కొంతమంది విద్యార్థులు కావలి సినిమా థియేటర్ల వైపు పరుగులు తీశారు. జలదంకి మండలంలో పదో తరగతి పరీక్షలు ఎంతో ప్రశాంతంగా జరిగినట్లు మండల విద్యాశాఖ అధికారి శ్రీధర్ తెలిపారు. జలదంకిలోని రెండు పరీక్షా కేంద్రాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జలదంకి ఎస్ఐ సయ్యద్ లతిపున్నిసా పూర్తి బందోబస్తు నిర్వహించారు. అలాగే విద్యాశాఖ ఆధ్వర్యంలో, పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు అవసరమైన తాగునీరు, ఇతర సౌకర్యాలను పకడ్బందీగా ఏర్పాట్లు చేసినట్లు ఎంఈఓ తెలిపారు.

# డయాలసిస్ సెంటర్ ఎమ్మెల్యే పరిశీలన



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** వింజమూరులోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన డయాలసిస్ సెంటర్‌ను ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మంగళవారం పరిశీలించారు. ఈనెల 4 గానీ ఐదో తేదీ గాని డయాలసిస్ సెంటర్‌ను ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ చేతుల మీదుగా ప్రారంభించనున్నారు. దానికి సంబంధించిన ఏర్పాట్లను ఎమ్మెల్యే పరిశీలించారు. నూతనంగా జనరేటర్‌ను కూడా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీడీఓ డాక్టర్ కార్తీక్‌తో మాట్లాడుతూ.. మంత్రి వస్తున్న సందర్భంగా ఏర్పాట్లను చక్కగా చేయాలన్నారు. కొరతగా ఉన్న డాక్టర్లు సిబ్బందిని నియమించుకునేందుకు నివేదిక తయారు చేయాలన్నారు. అదేవిధంగా అవసరమైన సదుపాయాలను కూడా మంత్రి దృష్టికి తీసుకువెళ్లాలని తెలియజేశారు. జిల్లా ఆరోగ్య శాఖ అధికారి తో సమన్వయం చేసుకుంటూ ఎక్కడ ఎలాంటి లోటు పాట్లు లేకుండా ప్రారంభోత్సవాన్ని విజయవంతం చేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు స్థానిక నాయకులు సిబ్బంది తదితరులు ఉన్నారు.

# జమ్మవరంలో పారిశుద్ధ్య నిర్వహణపై అవగాహన



**అనుమసముద్రంపేట, మేజర్‌న్యూస్ :** ఏఎస్పేట మండలం జమ్మవరం గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణపై గ్రామస్తులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈఓపిఆర్ అండ్ ఆర్‌డి రమేష్ పంచాయతీ కార్యదర్శి డి.ప్రకాష్‌రావు ఆధ్వర్యంలో జమ్మవరం గ్రామ పంచాయతీలో డైలీ చెత్త సేకరణలో భాగంగా ఐవిఆర్ఎస్ కాల్స్ నకు స్పందన మీద ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్రామంలోని 50 గృహాలను సందర్శించారు. అలాగే వీధి సమావేశాలను నిర్వహించారు. తడి చెత్త, పొడి చెత్త గ్రామంలో పారిశుధ్యం నిర్వహణ పైన ప్రజలను చైతన్య పరిచారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

# మాజీ సర్పంచ్‌ను పరామర్శించిన మేకపాటి



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** మండల పరిధిలోని గంగుల వారి చెర్లోపల్లి మాజీ సర్పంచ్ ఎం.శ్రీనివాసరెడ్డికి ఇటీవల గుండె ఆపరేషన్ చేయడంతో విషయం తెలుసుకున్న ఉదయగిరి నియోజకవర్గ వైయస్ఆర్సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్ రెడ్డి మంగళవారం ఉదయగిరిలోని తన ఇంటికి వెళ్లి అతను యోగక్షేమాలు తెలుసుకొని తొందరగా కోలుకోవాలని ప్రజాక్షేత్ర లోకి రావాలని అకాంక్షించారు కుటుంబ సభ్యులు లకు ధైర్యంగా ఉండాలని ఎల్లవేళలా అండగా ఉంటామని తెలిపారు పరామర్శించిన వారిలో మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కన్వీనర్ గానుపెంట శ్రీనివాసరెడ్డి, జడ్పిటిసి సభ్యులు మోడీ రామాంజనేయులు, మాజీ ఎంపీపీ చేజర్ల సుబ్బారెడ్డి, సొసైటీ మాజీ అధ్యక్షుడు వినయ్ కుమార్ రెడ్డి, బాలి బోయిన శ్రీనివాసులు, ఉప్పుటూరు హరి, గాను పెంట శ్రీనివాస్ రెడ్డి, సోమిరెడ్డి అక్కి భాస్కర్ రెడ్డి, అలీ అహమద్, కృష్ణ రెడ్డి, అక్కులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.